జిల్లా ప్రత్యేకాధికారిగా కన్నబాబు



పాడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.కన్నాబాబును నియమించారు. జిల్లాల్లోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా కె.కన్నాబాబును జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమించారు.

రోడ్డున పడ్డ విస్తరణ వ్యవహారం

ఆర్‌అండ్‌బీ అనుమతి లేకుండా హైవే అథారిటీ చర్యలు



విస్తరణకు ప్రతిపాదించిన చింతపల్లి వైపు వెళ్లే పాడేరు మెయిన్‌రోడ్డు

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- వివాదాస్పదమైన పాడేరు మెయిన్‌రోడ్డు విస్తరణ వ్యవహారం
- ఆది నుంచి అడ్డంకులే..

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రం పాడేరులోని ప్రధాన రహదారుల విస్తరణ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రస్తుతం రోడ్ల, భవనాల శాఖ ఆధీనంలో ఉన్న స్థానిక మెయిన్‌రోడ్లపై హైవే అథారిటీ పెత్తనం చెలాయించడంతో ఇరు శాఖల అధికారుల మధ్య అగ్గి రాజేసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

ఏజెన్సీలోని కొయ్యూరు మొదలుకుని అనంతగిరి మండలం వరకు జాతీయ రహదారి 516ఈ నిర్మాణం జరుగుతున్నది. ఈక్రమంలో గ్రామాలున్న ప్రాంతాల్లో బైపాస్ రోడ్లను నిర్మిస్తున్నారు. అందులో భాగంగానే పాడేరు పట్టణానికి శివారు గొందూరు నుంచి లగిశపల్లి, నక్కలపుట్టు, ఆడారిమెట్ట మీదుగా హుకుంపేట మండలానికి బైపాస్ నిర్మించనున్నారు. పాడేరు పట్టణంలోని రోడ్లు ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉన్నాయి. దీంతో ఆయా రోడ్ల విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించమని ఇటీవలే జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో అందుకు అవసరమైన ప్రణాళిక రూపకల్పనలో ఆ అధికారులున్నారు.



గతేడాది పాడేరులో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆర్‌అండ్‌బీ శాఖతో హైవే అథారిటీ సమన్వయ లోపం

ప్రస్తుతం పాడేరులోని మెయిన్‌రోడ్లు రోడ్ల, భవనాల శాఖ ఆధీనంలో ఉన్నాయి. ఈ రోడ్లకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టాలన్నా ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి తప్పనిసరి. కాని నేషనల్ హైవే అధికారులు మచ్చుకైనా వారిని సంప్రదించకుండా ఎటువంటి సమన్వయం లేకుండా ఆయా రోడ్ల విస్తరణకు ముందుకు వచ్చారు. అందులో భాగంగా ఇప్పటికే పాడేరు-చింతపల్లి మార్గంలోని రోడ్డుకు ఇరువైపులా స్థల సేకరణ, ఈ క్రమంలో ఇల్లు, దుకాణాలను కోల్పోయే బాధితులకు నోటీసులు జారీ చేశారు. ఈ విషయం తెలిసిన ఆర్‌అండ్‌బీ అధికారులు తమకు ఎటువంటి సమాచారం లేకుండా మా ఆధీనంలో ఉన్న రోడ్లపై హైవే అథారిటీ అధికారులు ఎలా పెత్తనం చెలాయిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుందరంబాబు నేషనల్ హైవే అథారిటీ అధికారుల దృష్టికి తీసుకుకెళ్లడంతోపాటు, ఆశాఖ రాష్ట్ర అధికారులకు విషయాన్ని తెలియజేశారు. వాస్తవానికి తమతో సంప్రదింపులు జరిపిన అనంతరం మాత్రమే ఆయా రోడ్లకు సంబంధించి నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉందని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు. దీంతో వివాదం ఉన్నత స్థాయికి వెళ్లడంతో అక్కడ నుంచి క్లియరెన్స్ వస్తేనే గాని రోడ్ల విస్తరణ పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ముందుగానే ఆర్‌అండ్‌బీ అధికారులతో హైవే అథారిటీ అధికారులు సంప్రదింపులు జరిపితే ఈ సమస్య వచ్చేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మెయిన్‌రోడ్ల విస్తరణపై ఆది నుంచి అడ్డంకులే..

పాడేరు మెయిన్‌రోడ్ల విస్తరణ పనులకు ఆది నుంచి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. స్థానిక ... మిగతా 8వ పేజీలో

అధికారంలో ఉన్నాం.. అణిగి మణిగి ఉండండి

ఎవరూ విర్రవీగొద్దు...

- ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి
- కూటమిలో మిగిలిన పార్టీలతో కలిసి పనిచేయండి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, నేతలకు మంత్రి నారా లోకేశ్ సూచన
- అక్టోబరు నుంచి పార్టీ సభ్యత్వ నమోదు
- కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు
- అందరూ కలిసికట్టుగా అభివృద్ధికి కృషి చేయాలి



విశాఖపట్నం జిల్లా భీమిలి కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులతో మంత్రి నారా లోకేశ్



విశాఖ నగర శివారునున్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి లోకేశ్

విశాఖపట్నం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చాం కదా అని విర్రవీగొద్దని, అణిగిమణిగి ఉండాలని ప్రజా ప్రతినిధులకు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జులకు, నేతలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీకి 151 సీట్లు ఇస్తే అధికారం తలకెక్కి...అరాచక పాలన సాగించి ప్రజాగ్రహానికి గురైందని గుర్తుచేశారు. క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం, మిత్రపక్షాలైన జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో నీతివంతమైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని, అందుకు తగిన విధంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి పార్టీలతో కలిసి పనిచేయాలన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్నారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని, దీనికి అనుగుణంగా అక్టోబరు నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని లోకేశ్ తెలిపారు. ప్రతి ఎమ్మెల్యే/ఇన్‌చార్జి తమ పరిధిలో సభ్యత్వ నమోదు పక్కాగా చేపట్టాలని సూచించారు. గడచిన ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. నామినేటెడ్ పదవులపై ఇప్పటికే కసరత్తు జరిగిందని, కష్టపడే వారికి పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. మరోసారి విశాఖ వచ్చినప్పుడు విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి, అన్ని విషయాలపై చర్చిస్తామన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బదిలీల్లో ముఖ్యమంత్రి పక్కాగా ఉంటూ సమర్థులకు పోస్టింగ్స్ ఇస్తున్నారన్నారు. అదే ఒరవడి కొనసాగించాలని నిర్ణయించారన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ... మిగతా 8వ పేజీలో

ఆశ్రమ పాఠశాలలో ఆహారం కలుషితం

110 మందికిపైగా విద్యార్థినులకు అస్వస్థత



అరకులోయ ఏరియా ఆస్పత్రిలో విద్యార్థినులకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం

- 60 మంది అరకు ఏరియా ఆస్పత్రికి తరలింపు
- మిగిలిన వారికి ఆశ్రమంలోనే వైద్య సేవలు
- విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు
- అత్యవసరానికి సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లు



ఆశ్రమ పాఠశాల నుంచి ఏరియా ఆస్పత్రికి వస్తున్న విద్యార్థినులు

... వార్తలు మెయిన్, జిల్లా 8లో

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

- జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో ఘనంగా వన మహోత్సవం

పాడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ మూలమని, ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం పురస్కరించుకుని స్థానిక గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావితరాల బాగుకు మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. అలాగే రాష్ట్రంలో 33 శాతం అడవులుండాలని, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం అడవుల పెంపకమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నదన్నారు. పోడు వ్యవసాయం, వంట చెరకు సేకరణ, ఇతర అవసరాలకు అడవులను నరికేస్తున్న మనం మొక్కల పెంపకానికి అదే స్థాయిలో కృషి చేయడం లేదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే భవిష్యత్తులో భూతాపం పెరిగి, గరిష్ఠ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయన్నారు. అందువల్ల మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని, లేకుంటే జీవవైవిధ్యం దెబ్బతిని మానవులతోపాటు జంతువులు, పక్షులు వంటి అనేక జీవుల మనుగడ కోల్పోతాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్ మాట్లాడారు. అనంతరం వారంతా మొక్కలను నాటి, వనమహోత్సవం పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన నృత్య ప్రదర్శనలను తిలకించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ప్రశాంతకుమార్, పాడేరు, చింతలవీధి సర్పంచులు కొట్టగుళ్లి ఉషారాణి, సీతమ్మ, గురుకులం, రెవెన్యూ, అటవీ శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



వన మహోత్సవం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, పీవో అభిషేక్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్

నేటి పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో మొత్తం 1,25,261 మందికి రూ.52.13 కోట్లు మంజూరు

డీఆర్‌డీఏ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు

పాడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 31న సామాజిక పెన్షన్ల పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో ఆగస్టు 31న పెన్షన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని 22 మండలాల పరిధిలోని ఒక లక్షా 25 వేల 261 మంది పింఛన్‌దారులకు పెన్షన్ అందించేందుకు డీఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవోలు, గ్రామ సచివాలయ సిబ్బంది సిద్ధమవుతున్నారు. జిల్లాలో సామాజిక పెన్షన్ల కోసం ప్రభుత్వం రూ.52 కోట్ల 13 లక్షల 92 వేల 500 మంజూరు చేసింది. దీంతో శనివారమే శత శాతం పెన్షన్ సొమ్మును లబ్ధిదారులకు అందించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏదైనా కారణంతో 31న పెన్షన్ పొందని వారికి సెప్టెంబరు రెండో తేదీన అందిస్తారు.

డీఆర్‌డీఏ కార్యాలయంలో కాల్ సెంటర్

జిల్లాలో సామాజిక పెన్షన్ల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో పెన్షన్ల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలోని సచివాలయాల వారీగా జరుగుతున్న పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించడంతోపాటు, ఎక్కడైనా పంపిణీలో జాప్యం జరిగినా, ఇబ్బందులు ఏర్పడినా కాల్ సెంటర్ ద్వారా గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు అనువుగా డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ సజావుగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ తెలిపారు.

చింతపల్లిలో కుండపోత



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లి, ఆగస్టు 30: మండలంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం పడగా.. సాయంత్రం నుంచి ఎడతెరిపివ్వకుండా కుండపోత వర్షం పడింది. అధిక వర్షం వల్ల ప్రధాన రహదారులు వాగులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, చెరువుల్లో వర్షపు నీరు చేరింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

పెదబయలులో

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షానికి మండల కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం పాఠశాలల నుంచి ఇళ్లకు చేరుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి.

మేకల మందపై చిరుత దాడి?

మూడు మృత్యువాత.. ఒకదానికి గాయాలు

- గాయపడిన మేకకు వైద్యసేవలు
- రాజుపాకలో భయం...భయం
- ఇళ్లకే పరిమితమైన గిరిజనులు


అనంతగిరి, ఆగస్టు 30: మండలంలోని అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత సంచారంపై గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం గ్రామ సమీపంలో గల అటవీప్రాంతంలో మేకల మందపై చిరుత దాడి చేసి మూడు మేకలను చంపి వేసిందని గిరిజనులు తెలిపారు. పులి దాడిలో ఒక మేక గాయపడిందన్నారు. గాయపడిన మేకకు ఏహెచ్‌ఏ రవి శుక్రవారం ఉదయం వైద్యసేవలను అందించారు.



చిరుత దాడిలో గాయపడిన మేకకు వైద్యసేవలను అందిస్తున్న ఏహెచ్‌ఏ రవి

ఇరుకురాళ్లు ప్రాంతంలో చిరుత సంచారం

రాజుపాక గ్రామ సమీపంలో గల అటవీప్రాంతంలోని ఇరుకురాళ్లు ప్రదేశంలో చిరుత సంచరిస్తుందని గిరిజనులు తెలిపారు. పదేళ్ల క్రితం రెండు మేకలు చిరుత దాడిలో మృత్యువాత పడినట్టు గిరిజనులు తెలిపారు. అప్పటి నుంచి చిరుత సంచారం లేదని, గురువారం సాయంత్రం మేకల మందపై దాడితో భయంగా ఉందని వారంటున్నారు. ఈ విషయాన్ని అటవీ రేంజర్ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా చిరుత దాడి విషయం ఇంతవరకు తన దృష్టికి రాలేదన్నారు. ఈ విషయమై నిర్ధారణకు శనివారం తమ సిబ్బందిని రాజుపాకకు పంపిస్తామన్నారు.



డొంకరాయి జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి నుంచి 4,400 క్యూసెక్కులు విడుదల

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి నాలుగు వేల క్యూసెక్కులు

- గరిష్ఠ నీటి మట్టం 1037 అడుగులు
- ప్రస్తుతం 1036 అడుగులు ఉండేలా చర్యలు

సీలేరు, ఆగస్టు 30 : సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం రెండు గేట్లు ద్వారా 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గత రెండు రోజులుగా జలాశయం ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగుల నుంచి వరద నీరు భారీగా రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్నది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకోకుండా చర్యలు చేపట్టారు. డొంకరాయి జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1037 అడుగులు కాగా.. 1036 అడుగుల వద్ద నీటి మట్టం ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య



వేమల మహేష్ (ఫైల్‌ఫోటో)

కృష్ణాదేవిపేట, ఆగస్టు 30: పురుగుమందు తాగి ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన వేమల మహేష్ (33) శుక్రవారం తెల్లవారుజామున పురుగుమందు తాగాడు. అతడిని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచాడు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మేనమామ కొండబాబు ఫిర్యాదు మేరకు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రెండు ఆలయాల్లో హుండీలు చోరీలు

దేవరాపల్లి, ఆగస్టు 30: రైవాడలోని రెండు ఆలయాల్లో హుండీలు గురువారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. రైవాడ జలాశయం ఆనుకొని గట్టు దిగువ ఉన్న గ్రామ దేవత ఎరకాలమ్మ, శ్రీషిర్డీ సాయిరాం ఆలయాల్లో గేట్లు తాళాలను పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీలు చోరీ చేశారు. ఈ రెండు ఆలయాల్లో పది వేలుకు పైగా ఉండవచ్చని గ్రామస్థులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

లోకేశ్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

మహారాణిపేట, ఆగస్టు 30: విశాఖలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలనుంచి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రేమించాలంటూ వెంట పడిన ఉన్మాది చేతిలో కుమార్తెను కోల్పోయిన తమ కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అనకాపల్లి జిల్లా కొప్పుగుండుపాలెంకు చెందిన బుద్ధి వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న తన కుమారుడిని అక్కడ పోలీసులు అరెస్టు చేశారని, ఏం జరిగిందో ఇంతవరకు సమాచారం లేదని విశాఖకు చెందిన ఎ.అప్పలకొండ మంత్రి లోకేశ్‌ను కలసి కన్నీటిపర్యంతమయ్యారు. వారసత్వంగా సంక్రమించిన భూమిని కబ్జా చేయటంతో పాటు కొందరు చంపుతామని బెదిరిస్తున్నారని, ఈ స్థితిలో తమకు రక్షణ కల్పించాలని అనకాపల్లి జిల్లా బంగారయ్యపేటకు చెందిన మాతిరెడ్డి రాజునాయుడు వేడుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ నాటక రంగం విభాగంలో అతిథి అధ్యాపకుడిని నియమించాలని, కంప్యూటర్ సైన్స్ చదివానని, తనకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే, బంగారు భూమి డెవలపర్స్ నుంచి ఇళ్లు, స్థలాలను కొనుగోలు చేయగా, వైసీపీ నేతలు వాటిని ఆక్రమించి వేధిస్తున్నట్టు పలువురు బాధితులు తెలిపారు. రాష్ట్ర సిలబస్‌లో చదువుతున్న పాఠశాలల విద్యార్థులకు 9 10 తరగతుల్లో సీబీఎస్‌సీ హిందీ పాఠ్య పుస్తకాలు కాకుండా పాత పాఠ్యాంశాలనే కొనసాగించాలని నర్సీపట్నంకు చెందిన హిందీ ప్రచార సమితి సభ్యులు కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని కొనసాగించాలని దళిత ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

సీఐల కుర్చీలు ఖాళీ

- రెండు నెలల క్రితం వీఆర్‌లో పట్టణ సీఐ కాంతికుమార్
- రూరల్ సీఐ హరి బదిలీ.. ఇన్‌చార్జులను నియమించని వైనం

నర్సీపట్నం, ఆగస్టు 30: నర్సీపట్నం పట్టణ, గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు కుర్చీలు ఖాళీ అయిపోయాయి. సభాపతి ప్రాతినిథ్యం వహిస్తున్న నర్సీపట్నంలో శుక్రవారం ఇన్‌చార్జ్ సీఐలు లేకుండానే శాంతిభద్రతల పర్యవేక్షణ నిర్వహించారు. గతంలో ఇక్కడ పని చేసిన పట్టణ సీఐ కాంతికుమార్‌ను రెండు నెలల క్రితం డీఐజీ వీఆర్‌లో పెట్టారు. ఇంతవరకూ ఆయనకు పోస్టింగ్ ఇవ్వలేదు. టౌన్ స్టేషన్‌లో ఇద్దరు ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరావు విధులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం రూరల్ సీఐ హరి మన్యం జిల్లా పార్వతీపురానికి బదిలీ అయ్యారు. ఆయన రెండు నెలలుగా పట్టణ సీఐగా కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం ఆయన రిలీవ్ అయ్యారు. దీంతో పట్టణ, గ్రామీణ సీఐ కుర్చీలు ఖాళీ అయిపోయాయి. ఇటీవల రూరల్ ఎస్సై భీమరాజును నాతవరం బదిలీ చేశారు. రూరల్ స్టేషన్ నుంచి ఆయన ఇంకా రిలీవ్ కాలేదు. స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నర్సీపట్నం వంటి ప్రాధాన్యం ఉన్న చోట ఇద్దరు సీఐలు లేకుండా శాంతిభద్రతల నిర్వహణ చేయడం అనేది ఇదే మొదటిసారి అని పట్టణ వాసులు మాట్లాడుకుంటున్నారు. కనీసం ఇన్‌చార్జ్ సీఐలను కూడా నియమించక పోవడం గమనార్హం.

కాగా, శనివారం ధర్మసాగరంలో నిర్వహించే పింఛన్ల పంపిణీలో సభాపతి అయ్యన్నపాత్రుడు హాజరవుతున్న నేపథ్యంలో బందోబస్తు బాధ్యతలు గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన గణేశ్‌కు అప్పగించినట్టు భోగట్టా.

జిల్లా అదనపు ఎస్పీగా మోహనరావు నియామకం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: జిల్లా అడిషినల్ ఎస్పీ (క్రైమ్)గా ఎల్.మోహనరావు నియమితులయ్యారు. మోహనరావు రాజమహేంద్రవరం డీఎస్ఆర్‌పీ నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఇంతవరకు పనిచేసిన సత్యనారాయణరావు ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే.

తిరుపతి, సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 30: వినాయక చవితి, దసరా, దీపావళి పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, తిరుపతి, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగించినట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583) సెప్టెంబరు రెండు నుంచి నవంబరు 25 వరకు (ప్రతి సోమవారం), తిరుగు ప్రయాణంలోని తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584) సెప్టెంబరు మూడు నుంచి నవంబరు 26వ తేదీ వరకు (ప్రతి మంగళవారం) అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, విశాఖ- సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (08579) సెప్టెంబరు నాలుగు నుంచి నవంబరు 27 వరకు (ప్రతి బుధవారం), తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్- విశాఖ ప్రత్యేక రైలు (08580) సెప్టెంబరు ఐదు నుంచి నవంబరు 28 వరకు (ప్రతి గురువారం) అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు

పండగల సీజన్ దృష్ట్యా విశాఖ, చెన్నై ఎగ్మోర్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. 08557 నంబరు గల రైలు సెప్టెంబరు ఏడు నుంచి నవంబరు 30వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది. తిరిగి 08558 నంబరు గల రైలు సెప్టెంబరు ఎనిమిది నుంచి నవంబరు 31 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు చెన్నై ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు చెన్నై ఎగ్మోర్ చేరుతుంది.

అయ్యప్ప భక్తులకు విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక రైలు

శబరిమలై భక్తుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం తెలిపారు. 08539 నంబరు గల రైలు సెప్టెంబరు నాలుగు నుంచి నవంబరు 27 వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరిగి 08540 నంబరు గల రైలు సెప్టెంబరు ఐదు నుంచి నవంబరు 28 వరకు ప్రతి గురువారం రాత్రి 7.45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నందలూరు స్టేషన్‌లో హాల్ట్

ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ-తిరుపతి/ కడప మధ్య రాకపోకలు సాగిస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ప్రయోగాత్మకంగా శుక్రవారం (30వ తేదీ) నుంచి నందలూరు స్టేషన్‌లో ఒక నిమిషంపాటు హాల్ట్ కల్పించామని సీనియర్ డీసీఎం తెలిపారు. దీంతో విశాఖ నుంచి తిరుపతి / కడప వెళ్లే 17488 నంబరు గల రైలు ఉదయం 6.14 గంటలకు, తిరుగు ప్రయాణంలో కడప / తిరుపతి నుంచి విశాఖ వచ్చే 17487 నంబరు గల రైలు సాయంత్రం 6.09కు నందలూరు స్టేషన్‌లో ఆగుతుందని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	88.00
లైవ్ ధర	108.00
విత్ స్కిన్	186.00
స్కిన్ లెస్	196.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటండి

- సంరక్షించే బాధ్యతలను సైతం తీసుకోండి
- వన మహోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



బెలూన్ ఎగురవేస్తున్న అయ్యన్న

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలను నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో శుక్రవారం సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యార్డు ఆవరణలో అయ్యన్నపాత్రుడుతో పాటు ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌లు మొక్కలు నాటి బెలూన్లు ఎగురవేశారు. అనంతరం అయ్యన్న మాట్లాడుతూ గతంలో తాను అటవీ శాఖా మంత్రిగా ఉన్న సమయంలో పాఠశాలల్లో రెడ్‌క్రాస్, గ్రీన్‌క్రాప్, ఎన్సీసీ వంటి విభాగాలతో ప్రత్యేకంగా ఒక రోజు లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకునేవారమన్నారు. ప్రస్తుతం వాటన్నింటినీ పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలో ఉన్న నాలుగు లక్షల మంది డ్వాక్రా మహిళలను మొక్కల పెంపకంలో భాగస్వామ్యం చేయాలన్నారు. శాస్త్రవేత్తలు వద్దని సూచించిన కొన్ని జాతుల మొక్కలను రోడ్డు మధ్య, డివైడర్లపై నాటవద్దన్నారు. అన్ని కళాశాలల్లో మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు వెడల్పు చేసినప్పుడు చెట్లు నరికితే వాటిని తిరిగి పెంచేందుకు ప్రత్యేకంగా రోడ్డు పని బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు జరిగేలా అనకాపల్లి జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలని కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి వారి ఇంటి పరిసర ప్రాంతాల్లో మూడు మొక్కలు నాటాలని సూచించారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 60 లక్షల మొక్కలు నాటామని, భవిష్యత్తులో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మొక్కలు పెంపకం అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్, అటవీశాఖ అధికారులు, జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

- క్రీడల వల్లే తనకు ఎమ్మెల్యే ఛాన్స్
- పోటీల ప్రారంభోత్సవంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: పట్టణంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రాష్ట్రస్థాయి 11వ సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ స్త్రీ, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను తొలుత శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు క్రీడలంటే ఇష్టమన్నారు. తాను 1983లో వాలీబాల్ క్రీడలో ఉండగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు క్రీడా కోటాలో ఎమ్మెల్యే ఛాన్సు కల్పించారన్నారు. పలు ప్రభుత్వ శాఖల్లో స్పోర్ట్స్ కోటా ఉన్నందున ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం నుంచి క్రీడల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ క్రీడల్లో అనకాపల్లికి మంచి గుర్తింపు ఉందన్నారు. ఏషియన్ గేమ్స్, ఒలింపిక్స్‌లో అనకాపల్లి క్రీడాకారులు విజయకేతనం ఎగురవేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలరావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీపీ బాబురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మాల వెంకటరామలతో పాటు పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏ కంపెనీ నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదు

- నిరూపిస్తే దేనికైనా సిద్ధం
- కొన్ని కర్మాగారాలకు నా తీరు కష్టంగా ఉంది
- అవాస్తవాలు రాసి విలేకరులు అభాసుపాలు వద్దు : ఎమ్మెల్యే 'సుందరపు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 30: ఆధారాలు లేని వార్తలు రాసి విలేకరులు అభాసుపాలు కావద్దని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ హితవు పలికారు. శుక్రవారం ఇక్కడి జనసేన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పదహారు సంవత్సరాలు కఠోరమైన దీక్ష చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. కర్మాగారాలను విజయకుమార్ దోచుకుంటున్నారని కొన్ని పత్రికలు అవాస్తవ కథనాలు రాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కంపెనీ నుంచైనా ఒక్క రూపాయి తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా తాను సిద్ధమని స్పష్టం చేశారు. కొన్ని కర్మాగారాలకు విజయకుమార్ తీరు కష్టంగా ఉందన్నారు. ఎందుకంటే మొక్కలు పెంచండి, సేఫ్టీ పాటించండి, స్థానికులకు ఉద్యోగాలివ్వండి , ప్రమాదాలు జరగకుండా చూడండి అంటూ.. ఒత్తిడి తెస్తుండడం వల్ల కొన్ని కర్మాగారాల యాజమాన్యాలు తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని సుందరపు పేర్కొన్నారు. కొన్ని పత్రికలు ఎవరి ప్రాపకానికో తప్పుడు వార్తలు రాస్తున్నాయన్నారు. అలా రాసిన విలేకర్లు భవిష్యత్తులో ఇబ్బందులు పడతారన్నారు. నిజాలు ఉంటే నిర్భయంగా రాయాలని స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టేకు చెట్లు నరికిందెవరో తేలేదెలా?

- నర్సీపట్నం, కృష్ణాదేవిపేట రేంజర్లు తలోమాట
- మా పరిధి కాదంటే.. మాది కాదంటూ నిర్లక్ష్యం
- అక్రమంగా నరికిన టేకు చెట్లు ఏ బీట్ పరిధిలోకి వస్తాయో తేలని వైనం
- సీసీఎఫ్‌కి ఫిర్యాదు చేసినా విచారణ నాన్చుడు ధోరణి



టేకు చెట్టు మాను

నర్సీపట్నం, ఆగస్టు 30: టేకు చెట్లు అక్రమంగా నరికింది మా పరిధి కాదంటే.... మా పరిధి కాదని నర్సీపట్నం, కృష్ణాదేవిపేట రేంజర్లు తలో మాట మాట్లాడుతున్నారు. నాతవరం సెక్షన్ పరిధిలోని వెదురుపల్లి, కృష్ణాపురం, అచ్చంపేట, సుందరకోట అటవీ ప్రాంతంలో ఈ నెల మొదటి వారంలో అటవీ సిబ్బంది సహకారంతో వంద టేకు చెట్లు అక్రమంగా నరికి వేశారని నాతవరం మండలం గుణిపూడికి చెందిన మరిడయ్య సీసీఎఫ్‌కి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మీనర్సు రెండు రోజులు పాటు టేకు ప్లాంటేషన్లు తనిఖీ చేసి తమ పరిధిలో చెట్టు నరక లేదని తేల్చేశారు. నరికిన మూడు టేకు చెట్లు సుందరకోట సమీపంలో కృష్ణాదేవిపేట రేంజ్ పరిధి బంగారయ్య బీట్ లోనివని ఆయన తేల్చారు. జీపీఎస్ నేవిగేషన్‌లో చూపించిన 1251 కంపార్ట్‌మెంట్ తమ (బంగారయ్యపేట బీట్) పరిధిలోకి రాదని నర్సీపట్నం రేంజ్, వెదురుపల్లి బీట్ అని కృష్ణాదేవిపేట రేంజ్ అధికారి వెంకట్రావు అన్నారు.

టేకు చెట్లు నరికింది ఏ బీట్‌లోనివి అన్నది పక్కన పెట్టి అధికారుల నిర్లక్ష్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అటవీ ప్రాంతంలో టేకు చెట్లు నరికి అక్రమంగా తరలించి 25 రోజులు కావస్తున్నా అటవీ ఉన్నతాధికారులు నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం

- అందరూ సహకరించాలి
- గత ప్రభుత్వంలో మాదిరిగా వేధింపులు ఉండవు
- మీ సమస్యలు తీర్చే బాధ్యత మాది
- భీమిలి కేజీబీవీ సందర్శనలో మంత్రి నారా లోకేశ్
- విద్యాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నాం



మంత్రి లోకేశ్‌కు మొక్కను బహూకరిస్తున్న కేజీబీవీ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

భీమునిపట్నం, ఆగస్టు 30:

"దేశంలో ఏపీ స్కూల్స్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడానికి మీ అందరి సహకారం ఎంతో అవసరం. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎవరిపైనా వేధింపులుండవు, మీ సమస్యలన్నీ తీర్చే బాధ్యత మాది."...

- భీమిలి కస్తూర్బాగాంధీ విద్యాలయం తనిఖీ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్

మంత్రి శుక్రవారం ఉదయం విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తొమ్మిది, పది తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిరిగి వెళుతుండగా సిబ్బంది అంతా 'థాంక్యూ సార్...' అని కోరస్‌గా చెప్పడంతో ఆగారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి పది లక్షల మంది విద్యార్థులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారన్నారు. తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కూడా కాలేదని, అన్నీ తెలుసుకుంటున్నాం, నేర్చుకుంటున్నామని, త్వరలో విద్యాభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించి అందరికీ పంపిస్తామన్నారు. ఒకేసారి అంతా ఇంగ్లీష్ చేసేస్తున్నామంటే పిల్లలు ఇబ్బంది పడతారన్నారు. ఇంగ్లీష్ లాంగ్వేజిని క్రమేణా చేర్పుతామన్నారు. వచ్చే ఐదేళ్లలో విద్యాపరంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ధ్యేయంగా పెట్టుకున్నామని, అందరూ బాధ్యతగా పనిచేసి సహకరించాలని కోరారు. 'స్కూల్ మెయింటెనెన్స్ ఎప్పుడూ ఇట్టానే చేయండి. ఈసారి అధికారులకు చెప్పి వచ్చాను. నేను వస్తున్నానని బాగా చేసి ఉండొచ్చు. నెక్స్ట్ టైమ్ ఎవరికీ చెప్పకుండా సడన్‌గా నేనొక్కడినే వస్తాను, ఈ విషయాన్ని కారులో మా అధికారులకు కూడా చెప్పా...' అని అన్నారు. దాంతో అందరూ వెల్‌కమ్ సార్ అని అన్నారు. ఈ దశలో సిబ్బంది చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామనగా, డిఫరెంట్ పీపుల్, డిఫరెంట్ ప్రాబ్లమ్స్...అన్నీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌ను చిప్పాడ దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజర్ సురేశ్‌కుమార్ కలిసారు. తమ కంపెనీ కేజీబీవీకి సీఎస్ఆర్‌లో చేస్తున్న సహకారాన్ని వివరించారు. ఓకే గుడ్ అంటూ, తర్వాత మరోసారి మాట్లాడదామని మంత్రి అన్నారు.

ఒక రోజు ముందే..

- నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ
- ఉదయం ఆరు గంటలకే ప్రారంభం
- జిల్లాకు రూ.108.12 కోట్లు విడుదల

అనకాపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు ఒక రోజు ముందుగానే పంపిణీ చేయనున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో కూటమి ప్రభుత్వం పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా శనివారమే పింఛన్ సొమ్ము అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 2,61,800 మంది ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.108.12 కోట్లు విడుదల చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ(డీఆర్‌డీఏ) అధికారులు సంబంధిత బ్యాంకులకు నిధులు జమ చేశారు. గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది ఆయా బ్యాంకుల నుంచి శుక్రవారం నగదు డ్రా చేశారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్‌లు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇళ్ల వద్ద అందుబాటులో ఉన్న పింఛన్‌దారులందరికీ సాయంత్రంలోగా నగదు అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు.

సమర్థంగా పింఛన్లు పంపిణీ: స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం, ఆగస్టు 30: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధికారులను ఆదేశించారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు అధికారులతో సమన్వయం చేసుకొని పింఛన్ల పంపిణీని విజయవంతం చేయాలని సూచించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి అనిత వ్రతం



అమ్మవారికి పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 30: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ హోం మంత్రి వంగలపూడి అనిత శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నక్కపల్లికి సమీపంలో ఉన్న తన నివాస గృహం వద్ద జరిగిన ఈ వేడుకను సింహాచలం నుంచి వచ్చిన వేద పండితులు మంథా కల్యాణ్ శర్మ జరిపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పార్శిల్ కార్యాలయాల్లో పోలీస్ జాగిలాలతో తనిఖీలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 30: గంజాయి రవాణా నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ ప్రాంతాల్లో పోలీసులు పార్శిల్ సర్వీస్ కార్యాలయాల వద్ద శుక్రవారం జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. పీటీడీ, రైల్వే స్టేషన్, ప్రైవేటు పార్శిల్ సర్వీసుల వద్ద గంజాయి, ఇతర మత్తుపదార్థాలను వాసనను గ్రహించి పసికట్టే పోలీస్ జాగిలాల ద్వారా పటిష్టమైన తనిఖీలు నిర్వహించామని జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. యువత అక్రమ సంపాదనకు ఆశపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి సేవించేవారు మానసికంగా, శారీరకంగా దుష్పరిణామాలకు గురవుతారని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడే వారికి 10 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలు శిక్షపడే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పరవాడ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాండవ డ్యామ్ మెయిన్‌గేటు షట్టర్‌కు మరమ్మతు



తాండవ డ్యామ్ మెయిన్‌గేటు షట్టర్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

నాతవరం, ఆగస్టు 30: తాండవ డ్యామ్ మెయిన్‌గేటు ఒక్క షట్టర్ ఇనుప రోప్ తెగిపోవడంతో అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టి తాండవగేటు తెరచుకునేలా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి విస్తారంగా వర్షాలు పడడంతో తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. తాండవ గరిష్ఠ నీటి మట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 377.7 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయి. అలాగే ఇన్‌ఫ్లోద్వారా తాండవలోకి 485 క్యూసెక్కుల నీరు వస్తోంది. తాండవ కుడి ఎడమ కాలువలకు 485 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతి

నర్సీపట్నం, ఆగస్టు 30: రాష్ట్రంలో 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను పీఆర్టీయూ విశాఖ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డీజీ నాథ్ కోరారు. గురువారం విశాఖపట్నం వచ్చిన మంత్రిని కలిసిన డీజీనాథ్ జీవో నెంబరు 117 రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. ఏజెన్సీకి బదిలీ అయిన ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలను బదిలీ చేయాని, మునిసిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి జీవో 84ని రద్దు చేయాలని కోరారు. కేజీబీవీలలో వార్డెన్ పోస్టులు ఖాళీలను భర్తీ చేయాలని వినతిపత్రం సమర్పించారు. అలాగే ఏపీ సీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు గాడి సూర్య ప్రకాశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ని విశాఖపట్నంలో కలిశారు. ఈ సందర్భంగా సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులు ఉపసంహరించాలని కోరారు.



అరకు-విశాఖ ప్రధాన రహదారిలో ప్రమాదకరమైన మలుపు దాటుతూ ములియగుడ పాఠశాలకు వెళ్తున్న బొడగుడ గ్రామానికి చెందిన విద్యార్థులు

చిన్నారులకు ఏం తెలుసు.. ఇది ప్రమాదమని..!

- అరకు-విశాఖ ఘాట్ రహదారిలో ప్రమాదకరంగా మలుపు
- రోజూ మలుపు దాటుతూ బొడగుడ గ్రామ విద్యార్థుల రాకపోకలు

అనంతగిరి ఆగస్టు 30: మండలంలోని టోకూరు పంచాయతీ ములియగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బొడగుడ గ్రామానికి చెందిన సుమారు 10 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారంతా ములియగుడ పాఠశాలలకు బొడగుడ గ్రామం నుంచి వెళ్లాలంటే.. బొడగుడ గ్రామ సమీపంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారిని దాటాలి. అసలే ప్రమాదకరమైన మలుపు కావడం.. ఆపై నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరమైనా, ఆ విషయం తెలియని విద్యార్థులు ప్రతి రోజూ మలుపు దాటుతూ పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొడగుడ గ్రామ సమీపంలో మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు..

మంత్రి లోకేశ్‌ను కలిసిన గిడ్డి ఈశ్వరి



మంత్రి లోకేశ్‌కు సమస్యలు తెలుపుతున్న ఈశ్వరి

పాడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శుక్రవారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలతో పాటు జీవో-3 పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆమె మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. అలాగే గిరిజన ప్రాంత సమస్యలు, అభివృద్ధికి సంబంధించి ఆయనకు గిడ్డి ఈశ్వరి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, టీడీపీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీటీడీ డిపోలో ప్రత్యేక రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న పీటీడీ సిబ్బంది

పాడేరు రూరల్, ఆగస్టు 30: పీటీడీ డిపోలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 16 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అనేక మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, ఎంతో మంది గర్భవతులు సకాలంలో రక్తం అందక ప్రమాదాల బారిన పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి కార్యక్రమాల్లో యువతీ యువకులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ శిబిరంలో పీటీడీ డీఎం శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, డాక్టర్ ఎస్.రాజీవ్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు జయలక్ష్మి, సూర్యారావు, సీటీడీ ఉద్యోగులు కేవీఎస్ఎన్.రాజు, బి.ప్రసాద్, శ్రీనివాసరావు, డిపో యూనియన్ నాయకులు, సిబ్బంది,

కొర్రాలో పారిశుధ్య పనులు



వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది

డుంబ్రిగుడ, ఆగస్టు 30: మండలంలోని కొర్రా గ్రామ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ లకే అర్జున్ ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో నిల్వ వున్న నీరు, వీధి కాలువలో పేరుకుపోయివున్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఫ్రై డే డ్రైడే కార్యక్రమం నిర్వహణపై అవగాహన పరుస్తూ నివాస గృహల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు బుల్లిబాబు, లక్ష్మీదర్, అప్పలస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజరవీంద్రనాథ్ చౌదరి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 30: ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్‌వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజరవీంద్రనాథ్ చౌదరి అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని గొందిపల్లి, బోనంగిపల్లి గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న 52 మందికి వైద్య పరీక్షలు చేశారు. జ్వర బాధితుల నుంచి రక్తపూతలు స్వీకరించి మలేరియా పరీక్షలు నిర్వహించారు. ఎవరిలోనూ మలేరియా వ్యాధి నిర్ధారణ కాలేదు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా జ్వరాలు, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పారా మెడికల్ ఉద్యోగులు మంగలక్ష్మి, అనిల్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో అధిక వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 30: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో అధిక వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. సెప్టెంబరు నాలుగో తేదీ వరకు అరకు బ్లాక్‌లో కనిష్ఠంగా 24.3 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 49.9 మిల్లీమీటర్లు, పాడేరు బ్లాక్‌లోకనిష్ఠంగా 24.5 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 41.9మిల్లీమీటర్లు, చింతపల్లి బ్లాక్ పరిధిలో కనిష్ఠంగా 27.5 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 52.5 మిల్లీమీటర్లు, రంపచోడవరం బ్లాక్ పరిధిలో కనిష్ఠంగా 7 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 35 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవుతుందన్నారు. అధిక వర్షాల వల్ల పంట పొలాల్లో మురుగు నీరు నిలువ లేకుండా బయటకు పోయేలా బోదెలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

విద్యార్థినులకు మెరుగైన సేవలు: డీఎంహెచ్‌వో



చికిత్స పొందుతున్న విద్యార్థినులు... అరకు ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

అరకులోయ, ఆగస్టు 30: విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నామని డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. అరకులోయ ఏరియా ఆస్పత్రి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థినులు తీవ్ర అస్వస్థతపై వెనువెంటనే స్పందించమన్నారు.. జామిగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులకు వైద్యసేవలను అందిస్తూ.. తీవ్ర అస్వస్థతకు గురైన 60 మంది వరకు ఏరియా ఆస్పత్రికి ఇప్పటి వరకు తరలించామన్నారు. నిల్వ ఆహారం తినడం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురై ఉంటారన్నారు. విద్యార్థినులు రాత్రి గుడ్డు తిన్నామని చెబుతున్నారన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఇద్దరు బలహీనత కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని, ఇద్దరికీ వైద్యుల పర్యవేక్షణలో సేవలను అందిస్తున్నామన్నారు. ప్రస్తుతానికి విద్యార్థినులు ఆస్పత్రిలో ఉన్నారని చెప్పారు.

మొదటకొచ్చిన ట్రాఫిక్ సమస్య

- సంతలో మళ్లీ రహదారికి ఆనుకుని దుకాణాలు
- వాహన చోదకులు, ప్రయాణికులకు తప్పని పాట్లు



రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు

చింతపల్లి, ఆగస్టు 30: మండల కేంద్రంలోని వారపు సంతలో వర్తకులు రహదారికి ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడంతో మళ్లీ ట్రాఫిక్ సమస్య మొదటికొచ్చింది. ప్రతీ బుధవారం జరిగే చింతపల్లి వారపు సంతలో గతంలో అన్ని రకాల



ఖాళీగా దర్శనమిస్తున్న సంత షెడ్లు

దుకాణాలు రహదారికి ఇరువైపులా వ్యాపారులు ఏర్పాటు చేసేవారు. దీంతో సంత రోజు ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై 'వారపు సంతలో ట్రాఫిక్ చిక్కులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించి రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసే దుకాణాలు రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సంత షెడ్ల వద్దకు తరలించారు. మూడు వారాల పాటు దుకాణాలు సంత షెడ్ల వద్దనే వ్యాపారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొన్ని దుకాణాలు పంచాయతీ కేటాయించిన స్థలాన్ని విడిచిపెట్టి రహదారికిరువైపులా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సంత షెడ్ స్థలం ఖాళీగా దర్శనమిస్తున్నది. కాగా రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక సమస్యతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసే దుకాణాలు తొలగించాలని వాహన చోదకులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి: ఎస్పీ అమిత్ బర్దార్



మొక్కలు నాటుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

హుకుంపేట, ఆగస్టు 30: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. తొలుత వనం..మనం కార్యక్రమంలో భాగంగా పోలీసులతో కలిపి మొక్కలు నాటారు. అనంతరం పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు, పోలీస్ స్టేషన్ ఆవరణను ఆయన పరిశీలించారు. మండల పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాడేరు-అరకు ప్రధాన రహదారిపై వాహనాలను ఎస్పీ దగ్గరుండి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దార్ విలేకర్లతో మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ ఆవరణలో పచ్చదనం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించినట్టు చెప్పారు. గతంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి, వాటిని వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం జరిగే వారపు సంతలకు వచ్చే వాహనాలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాల సమయంలో గెడ్డల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని, గతంలో చాలామంది మరణించారన్నారు. గంజాయి, సారా విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అమిత్‌బర్దార్ ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ తుహిన్ సిన్హా, సీఐ నాయుడు, ఎస్ఐ సతీష్, సిబ్బంది ఉన్నారు.

యూపీఎస్ రద్దు చేయాలని నిరసన



పాత పెన్షన్ పథకం అమలుచేయాలని నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

పాడేరు రూరల్, ఆగస్టు 30: రాష్ట్రంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చీకటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల పోరాటాల ఫలితంగా పాత పెన్షన్ పథకం అమలు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు పక్కన పెట్టడం అన్యాయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ప్రభుత్వ బిక్ష కాదని, అది ఉద్యోగుల హక్కు అని న్యాయస్థానం స్పష్టం చేసినప్పటికీ 20 ఏళ్లుగా ఈ ప్రభుత్వాలు కాంట్రిబ్యూషన్ పెన్షన్ పథకం అమలు చేయడం అన్యాయమన్నారు. 2024 ఆగస్టు 22న కేంద్ర ప్రభుత్వ కేబినెట్ ఆమోదం తెలిపినా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చని సూచన చేయడం దారుణమని వాపోయారు. పాత పెన్షన్ పథకానికి ఎక్కడా పోలికలేని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం లేని యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పథకంను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తుంటే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పథకం అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా తీసుకురావడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా నేడు నిరసనలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.సతీష్, కె.రాజారావు, ఎస్.గంగాధర్, ఎం.శ్రీను, ఎస్.రాజు, బి.ప్రవీణ్, కె.ఈశ్వర్‌నాయుడు, ఎస్.చిరంజీవి, హేమంత్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 30: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. పెదవలస పీహెచ్‌సీని శుక్రవారం సందర్శించారు. వార్డులు, ఓపీని ఆయన పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న దేవరాపల్లి ఎంపీటీసీ సభ్యుడు పోతురాజు కృష్ణమూర్తిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడుతూ అపిడమిక్ సీజన్ కావడంతో గ్రామాల్లో ఆదివాసీలు జ్వరాలు, అతిసార బారినపడే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైద్యాధికారి పృథ్వీష, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసరావు, వైసీపీ నేత కంకిపాటి గిరిప్రసాద్ పాల్గొన్నారు.

వీరన్నపడాల్‌ను పరామర్శించిన మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లి, ఆగస్టు 30: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కంకిపాటి వీరన్నపడాల్ త్వరగా కోలుకోవాలని మాజీ మంత్రి బాలరాజు ఆకాంక్షించారు. శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిని మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరన్నపడాల్ రాజకీయాల్లో చురుకైన పాత్రపోషించారన్నారు. ఆయన అస్వస్థతకు గురికావడం బాధాకరమని వాపోయారు. ఈ కార్యక్రమంలో యుజన సంఘం నాయకుడు ఉగ్రంగి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేత్రదానం చేసి మరోసారి జీవించడం

ముంచంగిపుట్టు, ఆగస్టు 30: నేత్రదానం చేసి మరోసారి జీవించాలని కిలగాడ పీహెచ్‌సీ డాక్టర్ రమేష్ చెప్పారు. కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో నేత్రదానంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానానికి స్వచ్ఛంగా ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆప్తాలిమిక్ అసిస్టెంట్ వి.కిశోర్‌కుమార్, వైద్య సిబ్బంది కె.సుబ్రహ్మణ్యం, ఆర్.మహేష్, జె.అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిసాధన పాఠశాలకు ఎక్సలెన్స్ అవార్డు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 30: ఆర్‌వీ నగర్ శాంతిసాధన పాఠశాల యాజమాన్యానికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్సు ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును శుక్రవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులకు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరి ఫిలిప్ పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ 'విస్తరణ వ్యవహారం'!

... 5వ పేజీ తరువాయి

అంబేడ్కర్ సెంటర్ నుంచి విశాఖపట్నం, అరకులోయ, చింతపల్లి మార్గాల వైపు మూడు కిలోమీటర్ల విస్తీర్ణంలో రోడ్డు విస్తరణ చేయాలని భావించారు. దీంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పాడేరు మెయిన్ రోడ్డు విస్తరణకు రూ.47 కోట్లు మంజూరు చేసింది. కాని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దానిని రద్దు చేసింది. దీంతో మెయిన్‌రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ఇదిలా ఉండగా గతేడాది అక్టోబరు నెలలో ఇక్కడికి వచ్చిన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి దృష్టికి అప్పటి కలెక్టర్ సుమిత్‌కుమార్ పాడేరులో రోడ్ల విస్తరణ అంశాన్ని తీసుకువెళ్లారు. దీంతో అందుకు ప్రత్యేక నిధులుగా రూ.17 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మొత్తం రోడ్డు విస్తరణకు రూ.30 కోట్లు అవసరం కాగా.. సీఎస్ ఆధ్వర్యంలో రూ.17 కోట్లు మంజూరు చేస్తే మిగిలిన రూ.13 కోట్లను ఆర్‌అండ్‌బీ ద్వారా వ్యయం చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భావించారు. అందుకుగానూ పాడేరు పట్టణంలోని మెయిన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. కాని వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో పాడేరు రోడ్ల విస్తరణ ఆగిపోయింది. ఇదిలా ఉండగా తాజాగా నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో విస్తరణ పనులు చేపట్టాలని చర్యలు ప్రారంభించగా రోడ్ల, భవనాల శాఖతో సమన్వయం లేకపోవడంతో వివాదాస్పదమైంది.

అధికారంలో ఉన్నాం... అణిగిమణిగి ఉండండి

... 5వ పేజీ తరువాయి

పల్లా శ్రీనివాసరావు బాగా పనిచేస్తూ అందరినీ సమన్వయం చేసుకుంటున్నారని అభినందించారు. ఈ సందర్భంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసి భారీఎత్తున అవినీతికి పాల్పడిన అధికారి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా వచ్చేందుకు యత్నిస్తున్నారని, ఇందుకు ఒకరిద్దరు సిఫారసు లేఖలు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ అవినీతికి పాల్పడే అధికారిని విశాఖ జడ్పీ సీఈవో పోస్టులో నియమించబోమని హామీ ఇచ్చారు. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమస్యలపై మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీలు ఎం.శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, విశాఖ, అనకాపల్లి, అరకు పార్లమెంటు నియోజవర్గాల పార్టీ అధ్యక్షులు గండి బాబ్జీ, బత్తుల తాతయ్యబాబు, కిడారి శ్రావణ్‌కుమార్, నాయకులు గిడ్డి ఈశ్వరి, దొన్నుదొర, ప్రగడ నాగేశ్వరరావు, బుద్దా నాగజగదీష్, చింతకాయల విజయ్, దాడి రత్నాకర్, కోరాడ రాజబాబు, పైలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి నుంచి 4,400 క్యూసెక్కులు విడుదల

... 5వ పేజీ తరువాయి

కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జలాశయంలోకి 8 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండడంతో నాలుగు వేల క్యూసెక్కులు కెనాల్ ద్వారా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నారు. అలాగే మరో 4,400 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లు ద్వారా ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరకుండా జెన్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సంక్షిప్తంగా..

వినాయకచవితి మండపాలకు అనుమతులు తప్పని సరి

జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్



పాడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయకచవితి మండలపాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వినాయచవితి వేడుకల నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ శాఖల అనుమతులను పొందవచ్చునన్నారు. నిర్వాహకులు 7995095800 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని పంపితే కాంటాక్ట్ నంబర్‌కు అనుమతులు పొందే అవకాశం కల్పిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ 'గణేశ్ ఉత్సవ్ డాట్ నెట్'లో ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందవచ్చునన్నారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరగాలని, నిర్వాహకులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్పీ అమిత్‌బర్ధార్ పేర్కొన్నారు.

జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈగా రామభద్రరాజు బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన రామభద్రరాజు

సీలేరు, ఆగస్టు 30: జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (సివిల్)గా కె.రామభద్రరాజు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఈగా విధులు నిర్వహించిన కేకేవీ ప్రశాంత్‌కుమార్‌ను విజయవాడ విద్యుత్ సౌధా కార్యాలయానికి బదిలీ చేసి, అక్కడ ఈఈగా పనిచేస్తున్న రామభద్రరాజుకు పదోన్నతిపై నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీర్లు, ఉద్యోగులు నూతనంగా బాధ్యలను చేపట్టిన రామభద్రరాజుకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

'బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి'

కొయ్యూరు, ఆగస్టు 30: బీజేపీ బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కూడా కృష్ణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం శరభన్నపాలెంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ప్రజాహిత పథకాలను మారుమూల గ్రామాల ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. అలాగే పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నేతలు సెగ్గే సన్యాసిరివు, సిద్దు, కూడా వెంకటరమణ, లక్ష్మయ్యలతో పాటు మరో 20 మంది బీజేపీలో చేరగా కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పలరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రరావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు, ఓబీసీ మోర్చా ప్రతినిధులు ఎం.చిన్న, ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

పాడేరు రూరల్, ఆగస్టు 30: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించనున్న క్విజ్ పోటీలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఎల్‌డీఎం పి.పోతునాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్ కార్యక్రమంలో 25 మంది పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి, ఎన్ఎస్ఎస్ పీవో గౌరీశంకరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర జీవనం

కొయ్యూరు, ఆగస్టు 30: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని సీడీపీవో విజయకుమారి పేర్కొన్నారు. డౌనూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని, ఇందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బాలమణి, సునీత, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు పూర్తిస్థాయిలో ఇవ్వాలి

సీలేరు, ఆగస్టు 30: గిరిజన రైతులకు పూర్తిస్థాయిలో రాజ్‌మా, ఇతర విత్తనాలు పంపిణీ చేయాలని అమ్మవారిధారకొండ రైతులు కోరుతున్నారు. గాలికొండ, ఎ.ధారకొండ పంచాయతీలకు తక్కువ విత్తనాలు వచ్చాయని అగ్రికల్చర్ అసిస్టెంట్ చెబుతున్నారని వారు ఆరోపించారు. దీంతో ఒక్కొక్క రైతుకు పది కిలోల విత్తనాలు మాత్రమే సరఫరా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క రైతు 300 కిలోలకు పైబడి నాటుతామని, అలాంటప్పుడు ఒక్కొక్కరికి కనీసం వంద కిలోలైనా సరఫరా చేయాలని గిరిజన రైతులు పి.బాలన్న, ఎ.సన్యాసిరావు, పి.రాజు, ఎ.సత్తిబాబు, పి.నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

అనంతగిరి, ఆగస్టు 30: మండలంలోని పినకోట పీహెచ్‌సీ పరిధిలో శనివారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానంపై ప్రజల్లో అపోహలు వద్దని, నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరికీ చూపును ఇచ్చిన వారమవుతామని ఈ సందర్భంగా వైద్యాధికారి డి.రూప్‌చంద్ చెప్పారు. కంటి వైద్య నిపుణులు రమణబాబు, వైద్య సిబ్బంది రవిశర్మ, అశ్విని పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెదబయలు, ఆగస్టు 30: మాదకద్రవ్యాలకు గిరిజన యువకులు దూరంగా ఉండాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.వెంకటరావు సూచించారు. మండలంలోని గలగండ పంచాయితీ మంగబంద గ్రామంలో శుక్రవారం సిబ్బందితో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్ కావడమే లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులు తమ మండలాలల పరిధిలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి సర్టిఫికెట్లను సమర్పించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులను ఎంపికచేసి జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వెళ్లవద్దని, గంజాయి రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఐ కుమార్‌బాబు పాల్గొన్నారు.